శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# రూ. 5 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం



**నెల్లూరు, జులై 29, ప్రభాతవార్త – వైద్యం** అక్కచెరువుపాడులో రూ. 5 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఆ నియోజకవర్గ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో శ్రీధర్ రెడ్డితో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొడ్డపనేని రాజానాయుడు, జనసేన నాయకులు సుజయ్ బాబు, స్థానిక కార్పొరేటర్ బత్తల మంజులలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాలు నిర్భయంగా, ముక్కుసూటిగా మాట్లాడటం నాకు అలవాటు అంతిమంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే నా ధ్యేయమని శ్రీధర్ రెడ్డి తెలిపారు. చెప్పిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తూ వస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. కొత్తూరు రెండు డివిజన్లు అంటే నాకు చాలా ఇష్టం. గత మూడు ఎన్నికల్లో ఈ ప్రాంతంలో నాకు భారీ మెజారిటీ వచ్చిందన్నారు. కొత్తూరు ప్రాంతంలో పేద, మధ్య తరగతి ప్రజలు నివసిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజల మౌళిక వసతుల కల్పనకు నిరంతరం రాజీలేని పోరాటం చేస్తానని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బత్తల కృష్ణ, పల్నాటి మస్తాన్ నాయుడు, మన్నేపల్లి రఘు, కూకటి హరిబాబుయాదవ్, ఆషిక్ అలీ ఖాన్, ఓబుల్ రాజు, జమీర్,వెంకురెడ్డి, దేవదాస్, శనగల దయాకర్, ఉదయ్, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, వెంకయ్య, కర్ణాల రమేష్, మురళి నాయుడు, గోపాల్ నాయుడు, సుబ్బారావు, ఖాదర్ బాషా, నాగమణి, దొరసానమ్మ, షఫీ, కరీముల్లా, అనిల్, రాము, కోటి, రియాజ్, రాజు, శివ, సెల్వకుమార్, షణ్ముగం, త్యాగి, రాందాస్ రెడ్డి, హరి పాల్గొన్నారు.

# రామాయపట్నం పోర్ట్ త్వరగా పూర్తి చేయండి

## కేంద్ర ప్రభుత్వానికి ఎంపి వేమిరెడ్డి విజ్ఞప్తి



**నెల్లూరు రూరల్, జులై 29, ప్రభాతవార్త** నెల్లూరు, ప్రకాశం జిల్లాకు ఎంతో ముఖ్యమైన రామాయపట్నం పోర్టును త్వరగా పూర్తి చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం లోక్ సభలో రూల్ నెంబర్ 377 ద్వారా ఆయన కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 13వ షెడ్యూల్ ప్రకారం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కేంద్రం చేపటట్టాలని, అందులో రామాయపట్నం వద్ద గ్రీన్ ఫీల్డ్ డీప్ సీ పోర్ట్‌ను నిర్మించడం ప్రధానమైందన్నారు. రామాయపట్నం వద్ద రూ. 3736 కోట్ల వ్యయంతో ఫేజ్ 1 ప్రాజెక్టు చాలా కాలం క్రితమే పూర్తి చేయాల్సి ఉందని, సౌత్, నార్త్‌లో బ్రేక్ వాటర్ పనులు గత సెప్టెంబర్‌లో పూర్తి కావాల్సి ఉందన్నారు. ఈ పోర్టులో పనులు దాదాపు నిలిచిపోయాయని ఎంపి వేమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఫేజ్ 1 పనులు పూర్తయితే 4 బెర్తులు ఏర్పాటు అయ్యేవని, పోర్ట్‌లో సంవత్సరానికి 34 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం ఉండేదన్నారు. ఇక మొత్తం బెర్తులు 19 కాగా ఈ పోర్ట్ యొక్క కార్గో హ్యాండ్లింగ్ కెపాసిటీ దాదాపు 140 మిలియన్ టన్నులు ఉంటుందన్నారు. కంటైనర్లు, బొగ్గు, బహుళ ప్రయోజనాల కోసం ఉపయోగించే ఇతర బెర్తుల కోసం ప్రత్యేక బెర్తులు ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. ఇటీవల సిఎం చంద్రబాబు నాయుడు రామాయపట్నం పోర్టు పనుల పురోగతిని సమీక్షించారని ఈ పోర్టు పూర్తికి కేంద్ర ప్రభుత్వ సాయం అత్యవసరమని నిర్ణయానికి వచ్చారన్నారు. అందువల్ల దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి రామాయపట్నం పోర్ట్ పనులను సమీక్షించి, ఫేజ్ 1 పనులు సమయానుకూలంగా పూర్తి చేసి, కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# క్షేత్రస్థాయిలో అర్జీలను పరిశీలించి వాటిని పరిష్కరించడానికి చర్యలు



**నెల్లూరు అర్బన్, జులై 29, ప్రభాతవార్త** ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించి పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజల నుండి వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలన్నారు. వికలాంగులు, వృద్ధుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అర్జీలను పరిశీలించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ లవన్న, జడ్పి సిఈవో కన్నమనాయుడు, జిల్లా పంచాయితీ అధికారి సుస్మిత, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. సాంబశివారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, డిటిసి చందర్, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, హౌసింగ్ పీడీ దయాకర్, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, డీఎస్ఓ వెంకటరమణ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పరిమళ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10వ తేదిన జడ్‌పి సాధారణ సర్వ సభ్య సమావేశాలు

**నెల్లూరు అర్బన్, జులై 29, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా నూతన ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆగస్టు 10వ తేదిన ఉదయం 10.30 నిమిషాలకు సాధారణ సర్వ సభ్య సమావేశాలు జరుగుతాయని జిల్లా పరిషత్ సిఈవో కన్నమ్మ నాయుడు తెలిపారు. ఈ సాధారణ సర్వసభ్య సమావేశానికి జిల్లా మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొంటారని జడ్పి సిఈవో కన్నమనాయుడు తెలిపారు. సమీక్ష అంశాలు.. జిల్లా వ్యవసాయ శాఖ జలవనరుల శాఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, స్త్రీ శిశువు, తదతర శాఖల అంశాలపై సమీక్ష ఉంటుందని తెలియజేశారు.

# రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన కరేడు విద్యార్థులు



ఉలవపాడు, జులై 29, ప్రభాతవార్త మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయలు పన్నూరు శ్రీనివాసులు తెలియజేశారు. ఈనెల 27,28వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ జంప్ రోప్ అసోసియేషనన ఆధ్వర్యంలో నంద్యాలలో జరిగిన అంతర్ జిల్లాల పోటీలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ప్రాతినిద్యం వహించిన 8వ తరగతి చదువుతున్న తాటిపర్తి ఉపదేష్ అండర్-12 విభాగంలో 30 సెకన్ల స్పీడ్‌లో రెండో స్థానం, ఐదో తరగతి చదువుతున్న కొక్కిలిగడ్డ వర్షిత బాలికల విభాగంలో మూడో స్థానం సాధించి రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఒగుబోయిన శ్రీనివాసులు తెలియజేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది మరియు గ్రామస్తులు అభినందించారు.

# కేంద్ర మంత్రితో ఎంపీ వేమిరెడ్డి భేటీ



**నెల్లూరు రూరల్, జులై 29, ప్రభాతవార్త** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డిప్రభాకర్ రెడ్డి భేటీ అయ్యారు. సోమవారం మంత్రి కార్యాలయానికి చేరుకున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయనతో భేటీ వివిధఅంశాలపై చర్చించారు. జిల్లాలోని సహజవనరులు, గనులకు సంబంధించి పలు విషయాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

# జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ప్రణాళిక పై సమావేశం





**నెల్లూరు అర్బన్, జులై 29, ప్రభాతవార్త** పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో 2024 - 25 సంవత్సరానికి జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ప్రణాళిక పై సమావేశం నిర్వహించారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి విజయ్ వినీల్ కుమార్ స్కిల్ డెవలప్మెంట్ ప్రణాళిక ఉద్దేశాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా నిరుద్యోగులు, విద్యార్థుల్లో నైపుణ్యాలు మధ్య అంతరాన్ని తగ్గించడానికి కృషి చేయాలన్నారు. ఇందుకుగాను ఆయా రంగాల్లో తరచుగా శిక్షణ కార్యాక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ రంగాల్లో ఉన్నటువంటి ఉద్యోగావకాశాలను గుర్తించాలన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో ఉన్న అవకాశాలను గుర్తించి, గ్రామీణ యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉదయగిరి చెక్క వృత్తి కళాకారులు తయారు చేసిన స్పూను, ఫోర్కులను జిల్లా కెలక్టర్‌కు డిఆర్‌డిఏ పిడి అందజేశారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి సాంబశివరెడ్డి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వెంకటయ్య, ఏపీఎంఐపి పిడి రవీంద్ర, వివిధ కాలేజీల స్కిల్ డెవలప్మెంట్ విభాగ అధికారులు పాల్గొన్నారు.

# నిర్ణీత సమయంలో ప్రజా సమస్యలను పరిష్కరించండి

## కమిషనర్ సూర్య తేజ



నెల్లూరు కార్పొరేషన్,జులై 29,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను(పిజిఆర్ఎస్) నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ సూర్య తేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందుకున్న సమస్యలకు సత్వరమే పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని అన్ని పాఠశాలలను తనిఖీ చేసి అవసరమైన రక్షణా చర్యలను తీసుకుంటామని తెలిపారు.పెండింగులో ఉన్న ఫిర్యాదుల స్థితిగతులపై విభాగాల వారీగా అధికారులతో సమీక్షించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.ప్రస్తుతం అందుకున్న వినతులు పూనరావృత్తం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం అందించాలని కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు సూచించారు.కమాండ్ కంట్రోల్ విభాగం సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పారిశుద్ధ్య నిర్వహణ సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ సూచించారు.విభాగాల వారీగా ఇంజనీరింగ్ -08, టౌన్ ప్లానింగ్ -15,పబ్లిక్ హెల్త్ - 05,రెవెన్యూ శాఖ -04,ఆప్కోస్ -03, హౌసింగ్ -13,అకౌంట్స్ -01,పెన్షన్-01,మొత్తం-50 ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద,ఇంజనీరింగ్ ఎస్.ఈ సంపత్ కుమార్,సిటీ ప్లానర్ దేవీ కుమారీ,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య,మేనేజర్ ఇనాయుత్తులా ఇతర అన్ని విభాగాల అధికారులు ,సూపరెంటెండెంట్ లు,సిబ్బంది పాల్గొన్నారు

# రాష్ట్ర మహిళా టీచర్స్అసోషియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక



నెల్లూరు,జులై29 ప్రభాతవార్త-విద్య : సోమవారం నగరంలోని ఓ కళ్యాణ మండపంలో రాష్ట్ర మహిళా టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మహిళా టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సరస్వతి పద్మజ సమక్షంలో ఈ ఎన్నికలు నిర్వహించగా రాష్ట్ర అద్యక్షురాలిగా అనంతపురం జిల్లా వాసిగొల్ల ఉమాదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదరి శ్గగా నెల్లూరు జిల్లాకు చెందిన విటపు రాధా రాణిలు ఎంపికైయ్యారు. అలాగే రాష్ట్ర గౌరవాద్యక్షురాలిగా సంగోజు రాజేశ్వరి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా కర్నూలు జిల్లాకు చెందిన వాసి చిన్ని అనూరాధ, రాష్ట్ర గౌరవ సలహాదారులుగా టీవీసుధారాణిలు ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటి సభ్యులు మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలల్లోని మహిళా టీచర్స్ సమస్యల సాధనకై 2012లో ఈ అసోసియేషన్‌ను ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. నాటి నుండి నేటి వరకు అనేక పోరాటాలు చేసి విజయం సాధించామన్నారు. భవిష్యత్‌లో కూడా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులుపాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించండి

**ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల మంజూరు, మ్యూటేషన్ ట్రాన్సాక్షన్లపై ప్రత్యేక దృష్టి**
**గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు**
**ఎటువంటి ఆధారాలు లేని ఎస్టిలకు ఆధార్ కార్డుల మంజూరుకు చర్యలు**
**వచ్చే నెల 1వ తేదినే 99 శాతం మేర పింఛన్ల పంపిణీ**
**పాఠశాలల్లో నిర్మాణంలో వున్న భవనాల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా ప్రత్యేక చర్యలు**
**పాఠశాలల్లో శిథిలావస్థకు చేరిన భవనాల కూల్చివేత**
**అన్ని పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు సక్రమంగా పనిచేయాలి**
**జిల్లా కలెక్టర్ ఆనంద్**



**నెల్లూరు అర్బన్, జులై 29, ప్రభాతవార్త** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో రెవెన్యూ ఇంటటిగ్రేటెడ్ సర్టిఫికేట్లు, మ్యూటేషన్లు, పెన్నానది పరివాహక మండలాల్లో కరకట్ట ఆక్రమణల తొలగింపు, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డుల పంపిణీ, ఎటువంటి ఆధారాలు లేని ఎస్టిలకు బర్త్ సర్టిఫికేట్లు, ఆధార్ కార్డుల మంజూరు, సీజనల్ వవ్యాధుల నివారణ, వచ్చే నెల 1వ పింఛన్ల పంపిణీ, ఉపాధి హామీ పనిదినాల పెంపు, పాఠశాలల్లో నాడునేడు అభివృద్ధి పనుల పూర్తి మొదలైన అంశాలపై సబ్ కలెక్టరు, ఆర్డివోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, తహశీల్దార్లతో కలెక్టర్ వీడియో కానరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రెవెన్యూలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల మంజూరు, మ్యూటేషన్ ట్రాన్సాక్షన్లపై తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎటువంటి కారణాలు లేకుండా అప్లికేషన్లు తిరస్కరణ చేయవద్దన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా నిర్దిష్ట గడువులోగా ఆయకట్టు వివరాలు సేకరించాలని, ఎంతమేర పొలాలకు నీళ్లు అవసరమో లెక్క తేలిస్తే ఐఎబి సమావేశంలో ఆ మేరకు నీరు విడుదలకు అవకాశం వుంటుంద న్నారు. రెవెన్యూ వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామాలు వారీగా ఆయకట్టు వివరాలు సేకరించాలన్నారు. పెన్నానది పరివాహక మండలాల్లో పెన్నా నది కరకట్ట ఆక్రమణలను తొలగించాలని, రాకపోకలకు సంబంధించి ఎక్కడైనా కట్టను తొలచి ఉంటే వెంటనే మట్టితో పూడ్చి యధాస్థానానికి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఒక నెలలోపు ఈ అక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలన్నారు.గ్రామాల్లో వైద్యారోగ్యశాఖ అధికారులు సూచించిన ప్రదేశాల్లో చెత్తాచెదారాన్ని తొలగించి వెక్టార్ కంట్రోల్ హైజనిక్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రజలు తున్న దృష్ట్యా ఎంపిడిఓలు, ఈవోపిఆర్డిలు, పంచాయితీ కార్యదర్శులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లోని డ్రైన్లలో పూడిక తీసి పిఆర్ 1 యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఓహెచ్ఆర్ ట్యాంకులను శుభ్రపరచడం, జంగిల్ క్లియరెన్స్, చెత్త సేకరణ కార్యక్రమాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులను విరివిగా అందించాలని, వ్యవసాయాధికారులు ఈ మేరకు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కొత్తవారికి కూడా కార్డులను అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 100 శాతం కౌలు రైతులకు కార్డులను అందించాలని సూచించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా వున్న ఎస్టీలకు బర్త్ సర్టిఫికేట్లు, ఆధార్ కార్డులను ఇప్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఎంపిడిఓలకు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంటు ద్వారా ఆధార్ కార్డు లేని ఎస్టీల జాబితాలు పంపినట్లు చెప్పారు. ఈ మేరకు నాన్ అవైలబుల్ సర్టిఫికెటు, అఫిడవిట్ తయారుచేసి దరఖాస్తు చేయించాలని దీని వల్ల ఎస్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంది, ఆ కుటుంబాలు ఆనందంగా వుంటాయని చెప్పారు. ఇలాంటి మంచిపని చేస్తే మన పేరు జీవితాంతం వారు గుర్తుపెట్టుకుంటారని, ఈ విషయమై ఎంపిడిఓలు, తహశీల్దార్లు, ఆర్‌డివోలు, ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వచ్చేనెల 1వ తేదినే 99 శాతం మేర పింఛన్లను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 31వ తేదినే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకుని సాయంత్రంలోగా సచివాలయ పరిధిలో సిబ్బందికి అందించాలని, 1వ తేది ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కావాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 1వ తేది సాయంత్రానికల్లా 99 శాతం మేర పింఛన్లను అందించేందుకు అందరూ సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఉపాధి హామీ పనిదినాలను బాగా పెంచాలని గ్రామాల్లో పనులు గుర్తించి ముమ్మరంగా పనులు చేపట్టాలన్నారు. ఏపివో, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పనిచేసి ఉపాధి పనిదినాలు పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణంలో వున్న భవనాల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంఈవోలు, హెచ్‌ఎంలకు సూచించారు. ఇటీవల నెల్లూరు బీవీ నగర్‌లోని కెఎన్ఆర్ పాఠశాలలో నిర్మాణంలో వున్న భవనం వద్ద విద్యార్థి మృతి చెందిన నేపథ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాలల్లో అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పాఠశాలల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేయాలని సూచించారు. నిర్మాణంలో వున్న భవనాల వద్ద రోప్‌లు కట్టి, డేంజర్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. 250 పైగా పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంటు రిపేర్లకు గురై వున్నాయని, వీటిని వెంటనే రిపేర్లు చేయించి వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. నాడు నేడు పనుల్లో భాగంగా మంజూరై ఉన్న నగదును ఖర్చుచేయాలన్నారు. అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, వంటగదుల నిర్మాణ పనులు, ఎలక్ట్రిఫికేషన్ మొదలైన పనులు పూర్తి చేసేందుకు ఈ నగదు వినియోగించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫిరెన్సులో ఇంచార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ, డిఆర్ఓ లవన్న, డిఆర్‌డిఎ పిడి సాంబశివారెడ్డి, జడ్పి సిఇఓ కన్నమనాయుడు, డ్వామా పిడి శ్రీనివాసులు, డిఎంఅండ్‌హెచ్ఓపెంచలయ్య, డిఇఓ రామారావు, సమగ్రశిక్ష ఏపిసి ఉషారాణి, జిల్లావ్యవసాయాధికారి సత్యవాణి,జిల్లా పంచాయితీ అధికారి సుస్మిత, హౌసింగ్ పిడి దయాకర్, ఐటిడిఎ పిడి దయాకర్, ఐటిడిఎ పివో పరిమళ, బిసి వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సోమశిలలో పండుగలా శుభదిన్ భోజన్



**అనంతసాగరం, జులై29, ప్రభాతవార్త :** అనంతసాగరం మండలం సోమశిల హిల్ కాలనీ లోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని దాతలు టిడిపి నాయకులు ఏగు పెంచలయ్య సహకారంతో పండుగలా నిర్వహించారు. ఈసందర్భంగా దాతలు టిడిపి నాయకులు ఏగు పెంచలయ్య విద్యార్థులకు భోజనాలు, స్వీట్లు, అరటిపండ్లు, పెన్సిల్స్, రబ్బర్లు, స్కేల్స్ అందజేశారు. అనంతరం దాత ఏగు పెంచలయ్య మాట్లాడుతూ ప్రతి రోజు స్కూల్‌కు వెళ్ళాలని తద్వారా చదువుతోపాటు క్రమశిక్షణ వస్తుందన్నారు. విద్యార్థులు చిన్నప్పటినుంచే క్రమశిక్షణతో విద్యను నేర్చుకోవాలని, గురువులను , పెద్దలను, తల్లిదండ్రులను గౌరవించాలని ,బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసభ్యులు చలంశెట్టి సునీత, టిడిపి మహిళా నాయకురాలు ఏగు రాధ, ప్రధానోపాధ్యారాలు ప్రసూన, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నందవరం మోడల్ స్కూల్ విద్యార్థులకు 10వేలు విరాళం ప్రకటించిన కళావని



**మర్రిపాడు, జులై29, ప్రభాతవార్త :** మర్రిపాడు మండలం నందవరం మోడల్ స్కూల్ విద్యార్థులకు సోమవారం జరిగిన శుభదిన్ భోజన కార్యక్రమానికి స్థానిక ఇంగ్లీష్ ఉపాధ్యాయిని 10వేల రూపాయల నిధులను అందజేసి మరోసారి తన సేవా నిరతిని చాటుకున్నారు. భారతప్రధానమంత్రి నరేంద్రమోడి పిలుపుమేరకు శుభదిన్ భోజన కార్యక్రమంలో భాగంగా నందవరం మోడల్ స్కూల్ విద్యార్థులకు స్వీట్స్, రుచికరమైన భోజనాన్ని మర్రిపాడు మండల విద్యాశాఖాధికారిని ధనలక్ష్మి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయిని కళావని విద్యాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తనవంతుగా విరాళం ప్రకటిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవలే తన కుమారుడు పుట్టినరోజు సందర్భంగా మొక్కల పెంపకానికి 5వేల రూపాయలను విరాళంగా ప్రకటించారు. తాజాగా నేడు 10వేల రూపాయలను ప్రకటించి మరోసారి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఈకార్యక్రమానికి విద్యాలయంలో పనిచేసే ఉపాధ్యాయులు కూడా తమవంతు ఆర్థికసాయాన్ని అందించారు. మోడల్ స్కూల్ విద్యాలయ ప్రిన్స్‌పాల్ లక్ష్మీనారాయణ సారథ్యంలో సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగేశ్వరరావ్, ఎమ్మార్పీ కలిశెట్టి రాజేంద్రకుమార్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉన్నతపాఠశాల విద్యార్థులకు సూరా భాస్కర్‌రెడ్డి చేయూత



**ఆత్మకూరు, జులై29, ప్రభాతవార్త :** ఆత్మకూరు ఉన్నతపాఠశాల విద్యార్థులకు పిఎం శుభదిన్ కార్యక్రమంలో భాగంగా 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి చేయూతనందించారు. స్థానిక గవర్నమెంట్ హైస్కూలు విద్యార్థులకు ఆయన స్వీటు, అరటిపండు పంపిణీకి తోడ్పాటును అందించారు. ఈసందర్భంగా హెడ్మాస్టర్ సి.హెచ్.అనంతలక్ష్మితో కలసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పారెంట్స్ కమిటీ చైర్మెన్ వంటేరు మల్లిఖార్జునయాదవ్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సదరంకు వచ్చే వారు సరైన పత్రాలతో రావాలి



**కోవూరు జూలై 29 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి సోమవారం సదరం పరీక్షలకు వచ్చే వారు తప్పనిసరిగా వారి దగ్గర ఉన్న పత్రాలను తీసుకురావాలని ఫిజియోథెరపిస్ట్ కిషోర్ తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన సదరం ఆరోగ్య క్యాంపుకు 15 మంది రోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారికి నిశితంగా పరీక్షలు నిర్వహించారు.

## ఘనంగా పీర్లకు పూజలు



**కోవూరు జూలై 29 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్‌లో ఉన్న పీర్ల చావిడిలో సోమవారం 9వ రోజు పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల చావిడికి వచ్చిన టీడీపీ సీనియర్ నాయకులు దారపనేని శ్రీనివాసులు నాయుడు, విన్నకోట రాధాకృష్ణలచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని పీర్ల పండుగ ఉత్సాహ కమిటీ వారిని ప్రత్యేకంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కార్యదర్శి షేక్ ఫిరోజ్, వై. సాయి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## ఎందుకు అంతమంది శానిటరీ ఇన్స్పెక్టర్లు...?

**నెల్లూరు కార్పొరేషన్, జులై 29, ప్రభాతవార్త:** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ లో హెల్త్ విభాగంలో పనిచేయుటకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 14 మంది రెగ్యులర్ శానిటరి ఇన్స్పెక్టర్లు ఉండాలని నిబంధన ఉంది.అందులోనూ 8 మంది రెగ్యులర్ ఇన్స్పెక్టర్లు,ఒక పర్మినెంట్ శానటరీ సూపర్వైజర్ లు ఉన్నప్పటికీ ఇందులో ఒక ఇన్స్పెక్టర్ల కు ఎటువంటి వార్డు కేటాయించలేదని,ఇంకా 5 మంది రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్లు,వీరులో ఒక హెల్త్ అసిస్టెంట్ కి ఎటువంటి డివిజన్ లేదని,వీరే కాకుండా ఇంకా 5 మంది పబ్లిక్ హెల్త్ మెస్త్రీలకు ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్లు గా విధులు నిర్వహించమని ఆదేశాలు.అదనంగా 19 మంది వార్డ్ శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలను ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్లుగా కేటాయించడం పట్ల ఆంధ్రప్రదేశ్ వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దారా సురేష్ బాబు సోమవారం కమిషనర్ కు వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు.ఇంతమందిని ఎందుకూ కేటాయించారో అన్న విషయం మీద విచారణ జరపాలని,అదే విధంగా సచివాలయం సెక్రటరీలుగా కొనసాగుతున్న ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్లు సహచర ఉద్యోగులపైన తప్పుడు ఆరోపణలు చేస్తూ పై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు.ఇలాంటి ఫిర్యాదులు చేసినందున డ్యూటీ పట్ల అంకిత భావం కలిగిన సెక్రటరీలు సైతం పై అధికారుల నుండీ మెమోలు,షోకాజ్ లు అందుకుంటూ మానసిక ఒత్తిడికి గురువుతున్నారని ఆరోపిస్తూ తెలిపారు.ఇదే విషయం పై గత 3 నెలల క్రితం ఫిర్యాదు చేసినా,ఎన్నికల కమిషన్ నియమాలు వల్లన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.మా ఆసోసియేషన్ తరుపున తమరి దృష్టికి తీసుకవస్తామని,తమరు తగు చర్యలు చేపట్టి ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్లను తొలగించి.సెక్రటరీలు అందరూ ఒక్కటే అన్న భావన కల్పించాలని కోరారు.

## యం.యం.టీ దాతృత్వంతో విద్యార్థులకు శుభ దిన్ భోజన్



**సిద్ధవరం(రాపూరు), జూలై29ప్రభాతవార్త :** మండలంలోని సిద్ధవరం మండల ప్రజా పరిషత్ మెయిన్ పాఠశాలలో గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ నాయకుడు మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి(యం.యం.టీ)దాతృత్వంతో విద్యార్థులకు శుభ్ దిన్ భోజన్(తిథి భోజనం) ఏర్పాటు చేశారు. పాఠశాలలో శిక్ష సప్తహ్ వారం రోజుల పాటు విజయవంతంగా నిర్వహించారు.చివరి రోజైనదాత యం.యం.టీ సహకారంతో విద్యార్థులకు భోజనంతో పాటు ఆదనంగా మామిడిపళ్ళు ,బత్తాయి ,అరటి పళ్ళు,పుచ్చకాయ, జామ పళ్ళు,లడ్లు,మిక్చర్,బిస్కెట్ ప్యాకెట్‌లను ఆందజేశారు. ఈ సందర్భంగా దాత మూరంరెడ్డిమధుసూధన్ రెడ్డికి ధన్యవాధాలు తెలిపారు. ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుండి క్రమశిక్షణతో వుండి విద్యాను నేర్చుకో వాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు గౌస్‌మోహిద్దీన్,పాయసం రేణుక,మద్యాహ్న బోజనం సహాయకురాలుపాలేటి విజయలక్ష్మీ తదితరులున్నారు.

## గ్రీవెన్స్ డేకు ప్రధాన శాఖల అధికారులు డుమ్మా



**కోవూరు జూలై 29 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంది. ఆయా శాఖలకు సంబంధించి ఎవరైనా అర్జీలు తీసుకువస్తే వాటికి తగు పరిష్కారం చూపేందుకు అవకాశం ఉంటుంది. అయితే సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి ట్రాన్స్‌కో , ఇరిగేషన్, సెబ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, మండల విద్యాశాఖ అధికారులు డుమ్మా కొట్టారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రానున్న సోమవారం అయినా గ్రీవెన్స్‌డేకు మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జలిల్ల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సోమవారం అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఉత్సాహంగా సప్తాహ ముగింపు కార్యక్రమం



**కోవూరు జూలై 29 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం సప్తాహ ముగింపు కార్యక్రమం సందర్భంగా శుభదిన్ భోజన్ తిథి భోజన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి తమ కుమార్తె పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాలలోని వెయ్యి మంది విద్యార్థులకు స్వీట్లు, మిర్చర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

## దాతల చొరవ అభినందనీయం



**ఇనమడుగు(కోవూరు) జూలై 29 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారంంద్ర ప్రభుత్వం అమలు చేసిన సప్తాహ ముగింపు సందర్భంగా ఈ గ్రామానికి చెందిన కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి , యర్రటపల్లి సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొల్లారెడ్డి సునీల్‌రెడ్డిలు దాతలు పాఠశాలపై ఉన్న మమకారంతో విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనాన్ని అందించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి ప్రత్యేకంగా చొరవ తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా దాతలు ముగ్గురిని పాఠశాల యాజమాన్యం ద్వారా శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నేతలు విద్యార్థులు ఉన్నారు

## సీతారామపురం తహసిల్దారు కార్యాలయం వద్ద ధర్నా



**సీతారామపురం జులై 29 ప్రభాతవార్త :** సీతారామపురం తహసిల్దారు కార్యాలయం ఎదుట మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమంలో దళిత గిరిజన ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ కలివెల ఏలిష్‌కుమార్ ఆద్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతు గ్రామాలలో రైతులకు చెల్లించిన నష్ట పరిహారం అంతంత మాత్రమే ఉందని సరైన అంచనాలు లేకుండా రెవిన్యూ సిబ్బంది తూతూ మంత్రంగా పనిచేస్తుందని అన్నారు. నేషనల్ హైవే 167 బి మరియుకక 167బిజి , రెండో హైవేల రైతులకు అన్యాయం జరిగిందని వారు వాపోయారు.ఒకే రకమైన ఇంటికి మూడు రకాల అంచనాలు ఒక రకమైన బావికి రెండు రకాల అంచనాలు ,ఒకరకమైన స్థిరాస్తికి వివిధ అంచనాలు వేసి పై అధికారులకు నివేదిక పంపడంతో రైతులకు నష్టవాటిల్లిందని అన్నారు. ఒకవైపు సీతారామపురం అభివృద్ధికి హైవేలు వస్తున్నాయని సంతోష పడాలో వ్యక్తిగతంగా రైతుకు జరిగిన అన్యాయానికి బాధపడలో తెలియడం లేదని వాపోతున్నారు. స్థానిక రెవిన్యూ సిబ్బంది తప్పిదాల వలనే ఈ సమస్య తలెత్తిందని అన్నారు. సీతారామపురం నుండి ప్రతి సోమవారం నెల్లూరుకి ఎంతో ఖర్చులు పెట్టుకొని వెళ్లి కలెక్టర్‌కి అర్జీలు ఇస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అన్ని గ్రామాలలో రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకోవడం జరుగుతుందని అన్నారు.జాయింట్ కలెక్టర్,ఆర్‌డిఒ ఆద్వర్యంలో స్థానికేతర సిబ్బందితో రీ వ్యాల్యువేషన్ ఖచ్చితమైన అంచనాలతో రైతులకు న్యాయ పరమైన నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.సీతారామపురం తహసిల్దారుకు రైతులు సమిష్టగా వినతి పత్రం సమర్పించగా తహసిల్దారు కృష్ణారెడ్డి,డిమాండ్ల పై అధికారులకు వెంటనే తెలియజేస్తామని హామి ఇవ్వడంతో దర్నా ముగించారు. ఈకార్యక్రమంలో రైతు నాయకులు మోహన్‌రెడ్డి,మద్దినేని శ్రీనివాసులు,సర్పంచ్ ఆదెయ్య,కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్రయ్య, సర్పంచ్ ఆదెయ్య,కరుణాకర్‌రెడ్డి,పోరుమామిళ్ళ పెద్ద కాశయ్య, చెంచయ్య,తిరపతయ్య,రమేష్, అన్ని గ్రామాలకు చెందిన బాధిత రైతులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీయుడబ్ల్యూజే కృషి

**నెల్లూరు జులై29 ప్రభాతవార్త-కార్పోరేషన్ :** జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తాము నిరంతం కృషిచేస్తామని ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష్య,ప్రధాన కార్యదర్శులు వల్లూరు వెంకటేశ్వర్లు,మస్తాన్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం నగరంలోని స్ధానిక ప్రెస్‌క్లబ్‌లో ఏపీయుడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ వారు మాట్లాడుతు దేశంలో ఐజేయూ, రాష్ట్రంలో ఏపీయుడబ్ల్యూజే అతిపెద్ద యూనియన్‌గా ఉంటూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు సాగిస్తుందని గుర్తుచేశారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ, అర్హులైన జర్నలిస్టులకు జీఓలతో సంబందం లేకుండా అక్రిడేషన్‌ల మంజూరు, జర్నలిస్టులకు ఇండ్ల స్ధలాల పంపిణీ, స్ధానిక మహబూబ్‌ఖాన్ పార్కులోని ప్రెస్‌క్లబ్ ఆధునీకరణ, ఇందుకు సంబందించిన నిధుల సేకరణ, తదితర అంశాలపై జిల్లాలోని రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలను కలిసి విన్నవించనున్నామని తెలిపారు. కొంతమంది వ్యక్తులు సమూహంగా ఏర్పడి నిర్వహిస్తున్న జర్నలిస్టుల భవనాలు, ఇరత యూనియన్‌లు నిర్వహిస్తున్న కార్యకలాపాలకు తమ అసోసియేషన్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. తమకు మహబూబ్ ఖాన్ పార్కులోని ప్రెస్‌క్లబ్ మాత్రమే ఉందని పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ నిర్వహణకు బాధ్యులుగా తమతోపాటూ ఖాజా, దయాశంకర్, హనోక్, పి.నాగరాజు, మజహర్‌లు చూస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు రమేష్, ప్రింట్ మీడియా కోశాదికారి హనోక్, ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, నాగరాజు, దయాశంకర్, సహాయ కార్యదర్శి సిహెచ్.నరేంద్ర బాబు, కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, రహ్మతుల్లా, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధవరంలో బిసి కాలనీలో రోడ్డు అక్రమణల తొలగింపు



**సిద్ధవరం(రాపూరు), జూలై29ప్రభాతవార్త :** మండలంలోని సిద్ధవరం గ్రామంలోని బిసి కాలనీలో రోడ్డు ఆక్రమణలు సోమవారం రెవెన్యూ, పంచాయితీఅధికారులు, పోలీసులు సంయుక్తంగా అక్రమణలు తొలగించారు. ఈ కాలనీకి చెందిన కోంత మంది రోడ్డు స్థలాన్ని అక్రమించి దారిని అడ్డగించారు. దీంతో కాలనీకి చెందిన మరి కోందరు రోడ్డు అక్రమణలు తొలగించాలని గత కోన్ని సంవత్సరాలుగా కోరుతున్నారు. ఈ క్రమంలో పంచాయితీ అధికారులు అనేక పర్యాయాలు అక్రమణలు తొలగించాలనిఅక్రమణదారులకు నోటిసులు జారీ చేశారు. ఈ అక్రమణలపై హైకోర్టు ఆదేశాలతో జిల్లా కలెక్టర్,పంచాయితీ అధికారులఆదేశాల మేరకు రోడ్డు అక్రమణలు తొలగించినట్లు పంచాయితీ కార్యదర్శి చెంచయ్య తెలిపారు. అక్రమణల తొలగింపు సందర్భంగా కాలనీలో ఉద్రిక్తత వాతావరణం నెలకోంది. దీంతో రాపూరు ఎస్ఐ మాల్యాద్రీ తన సిబ్బందితో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్రమణల తోలగింపు అనంతరం గోడవలు జరుగుతాయన్న సమాచారంతో కాలనీలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మద్యాహ్న బోజన నిర్వాహకురాలిని మార్చాలని వినతి



**రాపూరు, జూలై29ప్రభాతవార్త :** రాపూరు మండలంలోని అకిలివలస పంచాయి తీలోని ఓబులాయపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మద్యాహ్న బోజన కమిటీ నిర్వాహకురాలిని మార్చాలని సోమవారం ఆ గ్రామస్తులతో కలసి పాఠశాల విద్యాకమిటీ చైర్మన్,మరియు సభ్యులు మండల విద్యాశాఖాధికారి 2 జిలానీ భాషాకు వినతి పత్రం సమర్పించారు. ఈ పాఠశాలలోని నిర్వహకురాలు విద్యార్థులకు సరిగా భోజనం పెట్టడం లేదని అది ఎమని ప్రశ్నిస్తే ఎటువంటి సమాదానం ఇవ్వదని,భోజనం పాఠశాలలో వండాల్సి వుండగా ఆమె పాఠశాలలో బోజనం వండటం లేదని వారు తెలిపారు. ఈ విషయమై ఎన్ని సార్లు యంఇఒకి, ప్రధానోపాధ్యాయునికి విన్నవించినా పలితం లేదని వెంటనే ఆమెను మార్చి వేరోకరికి బోజనం ఏర్పాట్లు ఇప్పించాలని లేని పక్షంలో తాము ఆందోళన చేస్తామని వారు తెలిపారు.

## సహపంక్తి బోజనాలకు అందరు బాగస్వాములు కావాలి

**కలువాయి జూలై 29 ప్రభాతవార్త :** అన్ని పాఠశాలలో ప్రభుత్వం శిక్షసప్తాహ్ తిది కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఇందులో నిర్వహించే సహపంక్తి బోజనాలకు అందరు బాగస్వాములు కావాలని మండల విద్యాధికారి 2 ,జి .శేషగిరి రావు పేర్కున్నారు.కలువాయిలోనిమండల ప్రజా పరిషత్ పాఠశాల ( వెస్టు ) నందు సోమవారం నిర్వాహకులు దాతలు పాఠశాలలోని విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో ఉండే అంగన్‌వాడీ భవితా సెంటర్ విద్యార్థులకు పాఠశాలకు స్థల దాతలు అయిన గుండ్లపల్లి చిన మస్తానయ్య వసంతా దంపతులు మనోజ్ అభి కుటుంబసభ్యులు ఈకార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు బోజనాలు అందజేశారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఇఒ మాట్లాడుతు విద్యార్థుల సామాజిక, బావోద్వేగ , శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు తల్లిదండ్రుల కమిటీలు,తల్లిదండ్రులు ఉపాధ్యాయ సంఘాలతో సహకారాన్ని పెంపొందించడం అదే విధంగా నైపుణ్యాభివృద్ధికి పర్యావరణ వ్యవస్థను అందించడం ప్రత్యేక సందర్భాలలలో పుట్టి న రోజులు పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి బోజనాలు ఏర్పాటు చేయడం కార్యక్రమ ఉద్దేశమని అన్నారు.అనంతరం దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రేణుక,ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.గతంలో పాఠశాలకు ,పాఠశాలలో విద్యా బోదనను నిర్వహించేందుకు లక్షల రూపాయాల విలువ చేసే స్థలాన్ని గుండ్ల పల్లి మస్తానయ్య వారి కుటుంబసభ్యులు పాఠశాలకు అందించిన విషయం వారు మరిచిపోవడం గొప్ప విషయం అయితే ఈ సమీప వాసులుగా ఉన్న మేము గుర్తు పెట్టుకోవడం మా ధర్మం అంటు పూర్వ పేరెంట్స్ కమిటి సభ్యులు చల్లా విజయ్‌బాస్కర్‌రెడ్డితోపాటు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మరోసారి గుర్తు చేయడం గమనార్హం.బివిఎన్ఆర్ జడ్‌పిహైస్కూల్ నందు బివిఎన్ఆర్ జడ్‌పి హైస్కూల్ నందు ప్రభుత్వం నిర్వహించే శిక్షా సప్తాహ్ తిధి కార్యక్రమాన్ని ఉద్దేశించి సోమవారం పెంచలకోన ట్రస్టు బోర్డు మాజీ మెంటర్ చల్లా రఘురామిరెడ్డి ఆద్వర్యంలో విద్యార్థులకు సహపంక్తి బోజన కార్యక్రమాన్ని కలువాయి మండల కూటమి నాయకుల చేతుల మీదుగా స్వీట్లు, పంపీణి చేశారు. ఈకార్యక్రమంలో రఘురామిరెడ్డి అనుచరులు తదితరులు పాల్గోన్నారు.

## కావలిలో డొక్కా సీతమ్మ క్యాంటిన్ పునఃప్రారంభం




**కావలి, జులై 29 ప్రభాతవార్త :** కావలి ఏరియా వైద్యశాల ఆవరణలో డొక్కా సీతమ్మ క్యాంటిన్‌ను సోమవారం పునఃప్రారంభించారు. పేదవారి ఆకలి తీర్చాలనే ఆలోచనతో జనసేన నాయకుడు సిద్దు కావలి పట్టణంలోని ఏరియా వైద్యశాల ఆవరణలో రెండున్నర సంవత్సరాల నుండి పవనన్న క్యాంటిన్‌ను నిర్వహించారు. ప్రతి రోజు కావలి చుట్టుపక్కల గ్రామాల నుండి వైద్యం కోసం కావలి ఏరియా వైద్యశాలకు వచ్చే వందల మంది పేదవారి ఆకలి తీర్చారు. ఎన్నికల సమయంలో కొన్ని రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిలిపివేశారు. తిరిగి ఈ రోజు ఆంధ్రుల అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ పేరు మీద డొక్కా సీతమ్మ క్యాంటిన్‌ను పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, రంగా యువసేన అధ్యక్షుడు దేవరకొండ శ్రీనులు పేదవారికి భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాము, రమేష్, జనసేన నాయకులు సాయి, బాలు పాల్గొన్నారు.

## నాయినపల్లిసంఘంలో బిసిజి టీకాలు



**నాయినపల్లి(రాపూరు), జూలై29 ప్రభాతవార్త :** మండలంలోని యంవిపురం పంచాయితీ పరిధిలోని నాయినపల్లి గ్రామంలో సోమవారం వైద్య ఆరోగ్యసిబ్బంది వయోజనులకు బిసిజీ టీకాలు వేశారు. వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యా ధికారి ఆదేశాల మేరకుగ్రామంలో పర్యటించిన ఆరోగ్య కార్యకర్త క్షయవ్యాధి సోకకుండా బిసిజీ టీకా లు వేశారు. క్షయ వ్యాధి నివారణకువయోజనులు ఈ టీకాను వేసుకోవాలని ఆరోగ్య కార్యకర్త కోరారు. ఈ సందర్భంగా పలువురు మీడియా ప్రతినిధులు ఈ బిసిజీ టీకా వేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తతో పాటు,ఆశా వున్నారు.

## చిన్నారులకు విందు బోజనం వడ్డించడం ఆనందం
## టిడిపి నాయకులు కొటంరెడ్డి సురేష్‌రెడ్డి



**బుచ్చి జులై 29 ప్రభాతవార్త :** విద్యార్ధులకు విందు బోజనం వడ్డిచడం ఆనందంగా ఉందని టిడిపినాయకులు సురేష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని కొత్త మినగల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన శుబ్‌దిన్ బోజన కార్యక్రమాన్ని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు చిన్నారులకు వడ్డించడం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంఇఓ దిలీప్‌కుమార్, సర్పంచ్ బోర్రు పూజిత వ్యవహారించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతు తాను చదువుకున్న పాఠశాలలో చిన్నారులకు విందు బోజనం వడ్డించడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రజలు ముందస్తుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులన్ని సంప్రదించి పాఠశాలలో శుబ్‌దిన్ బోజనం ఏర్పాటు చేసుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమం అద్భుతమైనదని అన్నారు. ఎంఇఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతు ప్రజలు విద్యార్ధులకు ఇలాంటి విందు బోజనం పెట్టాలను కునే సంకల్పం రావడం చాలా సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సర్పంచ్ బొర్రు పూజిత, తులసి,సురేష్, చిలకపాటి అంకయ్య, శంఖవరం నరసిం హులు, పెనుబల్లి శ్రీదర్‌రెడ్డి, దాసరి సుబ్బయ్య,కోటంరెడ్డి రవికుమార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాంగోపాల్, రవీంద్రబాబు, కెసి నారాయణరెడ్డి, డి.వెంకయ్య, హాజరత్,కుమార్‌స్వామి, పృధ్వీ, రాజ్‌సి ంగ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## పొగొట్టుకున్న నగల సంచిని బాధితురాలికి అందజేసిన జిఆర్పీ, ఆర్‌పిఎఫ్ సిబ్బంది



**బిట్రగుంట, జులై 29 ప్రభాతవార్త :** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని తిరుమల నుండి విజయవాడకు వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడలోని కూచిపూడికి చెందిన తాతా నాగశ్రావణి తన కుటుంబ సభ్యులతో విజయవాడకు ప్రయాణిస్తూ ఎస్6 బోగీలో నగల హ్యాండ్ బ్యాగ్ కావలి సమీపంలో పడపోగా వెంటనే సంబంధిత జిఆర్పీ పోలీసులకు సమాచారం అందిచడంతో ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి సిబ్బంది టి.సురేష్, పద్మ బిట్రగుంట సెక్షన్ ట్రాక్‌మెన్ వెంకటేష్‌లు వెతికి జిఆర్‌పి ఎస్‌ఐ అరుణకుమారికి అందజేశారు. నగల సంచిలో 14 గ్రాముల బంగారు నల్లపూసల దండ, ముక్కుపుడక, వెండి లాకెట్, నగదును బాధితురాలికి ఎస్‌ఐ అరుణకుమారి సోమవారం అందించారు. పొగొట్టుకున్న నగల సంచిని వెతికి బాధితురాలికి అందజేయడంలో సహాయపడిన జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్, రైల్వే ట్రాక్‌మెన్‌ను ఎస్‌ఐ అభినందించగా, అందించినందుకు బాధితురాలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## చిన్నారులకు విందు బోజనం వడ్డించిన ఆనం



సంగం జులై 29 ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం అమలు పరిచే ఎన్ఇపిలో భాగమైన "శిక్షా సప్తాహ్"లో చివరి రోజు అటునటువంటి " శుభ్‌దిన్ భోజన " కార్యక్రమంలో భాగంగా సంగం మండలంలోని వెంగారెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ పాఠశాల ( జిపి ) నందు సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్ధులకు లడ్డు, కారాం బూంది, అరటిపండ్లు,పాయసం, పంచిపెట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆనంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతు దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనల మేరకు ఈకార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. పిల్లలకు ఇలా విందు బోజనం వడ్డించడం ఎంతో ఆనందంగా వుందని అన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రోజా రమణి, అంగన్‌వాడీ వర్కర్ సుగుణమ్మ, వర్కర్ లక్ష్మీ, మీనాక్షి, బుజ్జమ్మ తదితరులు పాల్గోన్నారు.

## బేతనీయపేటలో జిల్లా కుష్ఠ నివారణ అధికారి తనిఖీలు



**బిట్రగుంట, జులై 29 ప్రభాతవార్త :** బోగోలు మేజర్ పంచాయతీలోని బేతనీయపేటలో జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ నియంత్రణ అధికారి,అడిషినల్ డియం అండ్‌హెచ్‌వో ఎస్.కె.ఖాదర్‌వల్లి సోమ వారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహి ంచారు. ఎల్‌డిసి ప్రోగ్రామ్‌ని పరిశీలి ంచడంతో పాటు ఇంటింటికి వెళ్లి అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ వేసే విధానాన్ని తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ జిహారిక, సిహెచ్‌వో టి.అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

## సిటి కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం



**బిట్రగుంట, జులై 29 ప్రభాతవార్త :** బోగోలు మండలం చెంచులక్ష్మీపురం 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో బోగోలు 11కెవి ఫీడర్ సిటి కాలిపోయిన కారణంగా గత నాలుగు రోజుల నుండి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ట్రాన్స్‌కో ఎఇ ఎస్.కె.నాగూర్‌వల్లి చెప్పారు. చెంచులక్ష్మీపురం సబ్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలపై వివరణ ఇచ్చారు. సబ్‌స్టేషన్‌లో సిటి కాలిపోయిన విషయాన్ని ఉన్నతాధికారులకు తీసుకెళ్లామని రెండు రోజులలో కొత్తది ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతేకాకుండా గత ఐదు రోజుల నుండి తీవ్రమైన పడమర ఈదురు గాలులు వీస్తుండటంతో ఫీడర్స్ ట్రిప్ అవుతున్నాయని ఇది కూడా విద్యుత్ సరఫరా అంతరాయానికి మరొక కారణమన్నారు. పలుచోట్ల విద్యుత్ తీగలు వదులుగా వున్నాయని ఇవి తెగిపోయే అవకాశం వుందని వ్యవసాయ వినియోగదారుల నుండి తమకు ఫిర్యాదులు అందాయని అయితే ప్రస్తుతం వేరుశనగ పంట వేసి వున్న కారణంగా పంట పూర్తికాగానే మరమ్మతులు చేస్తామని ఆయన వివరణ ఇచ్చారు.

## కొండబిట్రగుంటలో శిక్షా సప్తాహ్ వారోత్సవాలు



**బిట్రగుంట, జులై 29 ప్రభాతవార్త:** బోగోలు మండలం కొండబిట్రగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ వారోత్సవాలు ముగింపు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఐడి కార్డులు, బ్యాడ్జిలు, టైలు ఎంఇవోలు పి.ఎల్.నరసింహారావు, జయమ్మలు అందజేశారు. పాఠశాలలోని సహోపాధ్యాయిని దేగా విజిత ఆర్థిక సహకారంతో విద్యార్థులకు వీటిని సమకూర్చారు. అనంతరం శుభదిన్ సందర్భంగా అదనపు పౌష్టికాహారం, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగింది.

## అఘాత్యానికి గురైన బాలిక కుటుంబాన్ని పరామర్శించిన నూర్‌బాషా దూదేకుల సంఘం నేతలు



**కావలి రూరల్, జులై 29 ప్రభాతవార్త:** కావలి పట్టణం తుఫాన్‌నగర్‌కు చెందిన షరీఫ్, పర్వీన్ దంపతులకు చెందిన 4వ తరగతి చదువుతున్న 9 సంవత్సరాల మైనర్ బాలికపై అదే ప్రాంతానికి చెందిన 53 సంవత్సరాల మహబూబ్‌బాషా అఘాత్యానికి పాల్పడటంతో ఆ బాలిక కుటుంబ సభ్యులను సోమవారం నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మస్తానమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, సంఘం నేతలు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ మస్తానమ్మ, షేక్ సలీంలు మాట్లాడుతూ మైనర్ బాలిక తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లిన సమయంలో వంటరిగా వున్న బాలికను వివస్త్రను చేసి అఘాత్యానికి పాల్పడిన మహబూబ్‌బాషా అనే మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తగిన శిక్ష పడేంత వరకు పోరాడతామని హెచ్చరికలు చేశారు. మైనర్ బాలిక కుటుంబానికి అండగా వుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూర్బాషా దూదేకుల సంఘం పట్టణ అధ్యక్షుడు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ ఖలీల్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ చెన్నయ్య, యువజన విభాగ అధ్యక్షులు షేక్ రఫీ, మహిళా విభాగ రాష్ట్ర సభ్యులు దిల్షాద్, నెల్లూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు షాకిర, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో మెడల్స్ సాధించిన కొత్తసత్రం విద్యార్థులు



**కావలి రూరల్, జులై 29 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం కొత్తసత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థునులు నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీలలో మెడల్స్ సాధించారు. 7వ తరగతి చదువుతున్న ఎల్లంగారి జ్యోతి మూడు నిమిషాల స్పీడ్‌లో అండర్ 12 విభాగంలో ప్రథమ బహుమతి సాధించింది. 7వ తరగతి చదువుతున్న పామంజి సరిత 30 సెకండ్ల స్పీడ్‌లో అండర్ 12 విభాగంలలో ప్రథమ బహుమతి దక్కించుకుంది. వాయిల శాలిని ఫ్రీస్టయల్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించింది. ఎల్లంగారి కల్పన 30 సెకండ్ల స్పీడ్‌లో అండర్ 14 విభాగంలో ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, పిడి మురళి, గ్రామస్తులు అభినందించారు. అనంతరం పిడి మురళి మాట్లాడుతూ మెడల్స్ సాధించిన విద్యార్థునులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఆగస్టు 30వ తేది నుండి సెప్టెంబరు 2వ తేది వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు.

## దివ్యాంగుల కాలనీలో అక్రమ కట్టడాలు తొలగించాలి



**కావలి రూరల్, జులై 29 ప్రభాతవార్త :** కావలి మున్సిపాల్టీ పరిధిలోని దివ్యాంగుల కాలనీలో అక్రమంగా స్థలాలను ఆక్రమించుకుని అక్రవ ంగా కట్టడాలను నిలుపుదల చేయాలని కావలి ముసునూరు దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు, టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు మండవ వెంకట్రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారికి మండవ వెంకట్రావు దివ్యాంగులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మండవ మాట్లాడారు. దివ్యాంగుల కాలనీలో 269,270,271 ప్లాట్లను విఆర్‌ఎలు ఆక్రమించి అక్రమంగా కట్టడాలు కడుతున్నారన్నారు. అలాగే పుట్టు దివ్యాంగులైన వారి 269,254,270 ప్లాట్లను ముస్లింలు ఆక్రమించుకున్నారని తెలిపారు. అదేమని ప్రశ్నిస్తే దొంట పట్టాలు చూపిస్తున్నారన్నారు. దొంగ పట్టాలకు విద్యుత్ ఏ విధంగా ఇచ్చారో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. దొంగ పట్టాలు సృష్టించి అక్రమంగా కట్టడాలు కడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అక్రమంగా కట్టిన కట్టడాలను కూల్చివేయాలన్నారు. అక్రమదారులను దివ్యాంగుల కాలనీలో వుండేందుకు ఒప్పుకోమని వెంటనే వారి నుండి దివ్యాంగుల కాలనీని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కాలనీలోని దివ్యాంగులు పాల్గొన్నారు.

## కృష్ణపట్నం పంచాయితీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వనతి పత్రం

**నెల్లూరు అర్బన్, జులై 29, ప్రభాతవార్త :** కృష్ణపట్నం గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఓ ఆనంద్‌కు సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం పొందుటకు దరఖాస్తు ఇవ్వడం జరిగింది. కృష్ణపట్నం పంచాయితీలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం 2019 – 23 అభివృద్ధి పనుల కోసం ఎంత నిధులు కేటాయించిందో తెలపాలని అన్నారు. కృష్ణపట్నం పంచాయితీలో బిపిఎస్‌ఎల్ కంపెనీ ఇటీవల పైపులైను వేస్తున్నామని నోటీసులు ఇచ్చారు. కానీ ఈ పైపులను వేస్తున్నట్లు ముందుగా ఇటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు. అలాగే పంచాయితీ చుట్టుపక్కల ఉన్న పరిశ్రమలు సిఎస్‌ఆర్ ఫండ్ కింద ఎంత నిధులు ఖర్చు చేశారు ఆధారాలు తెలపాలని అన్నారు. పంచాయితీ ఖాతాలో మిగిలిఉన్న నిధులు వివరాలు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసులు, వెంకటాద్రి, గోవిందయ్య, సుబ్బులు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపాడులో శుభదిన్ భోజన కార్యక్రమం



**మర్రిపాడు, జులై29, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మర్రిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ప్రధానో పాధ్యా యురాలు పులికొల్లు పద్మలత అధ్యక్షతన పిఎం శిక్షా సప్తాహ్ శుభదిన్ భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఓ ధనలక్ష్మి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి విద్యార్థుల జీవితాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా సాగాలన్న సంకల్పంతో పిఎం శిక్షా సప్తాహ్ శుభదిన్ భోజన కార్యక్రమాన్ని దాతల సహకారంతో చేసేలా రూపకల్పన చేశారన్నారు. మర్రిపాడుకు చెందిన ప్రముఖ స్నేహితులు మర్రిపాడు వెంకటేశ్వర ట్రేడర్‌స కు చెందిన్న రెడ్డప్ప రెడ్డి మర్రిపాడు జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ హనుమంతరాజు , సిఆర్‌పి కస్తూరయ్య, విద్యాకమిటీ చైర్మెన్ దుంపలగడ్డ వెంకటేశ్వర్లు అడిగిన వెంటనే ముందుకొచ్చి తమ ధాతృత్వాన్ని చాటుకోవడం ఎనలేనిదన్నారు. విద్యార్థులకు విరామ సమయంలో వడ , సమోసాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎంత ఎదిగినా ఒదిగుండే మనస్థత్వం కలిగిన మంచి వ్యక్తి పడచల నాగేశ్వరరావ్, అనంతరం మండలంలోని విద్యాభివృద్ధికి ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా నిరంతర పర్యవేక్షకుడిగా కలిశెట్టి రాజేంద్రకుమార్ పాల్గొని తమ అమూల్యమైన సందేశాన్ని విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సహకరించిన దాతలు త్రిమూర్తులకు ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవ కోసం ఎప్పుడు అడిగినా సరేనంటూ రెడ్డప్పరెడ్డి హనుమంతరాజు , కస్తూరయ్యలు తమవంతు అటు విద్యార్థులకు, ఇటు ప్రజాసేవకు సంతృప్తి చెందడం వారికి వెన్నతోపెట్టిన విద్య అని వారి సేవలను కొనియాడారు. దాతలకు ముఖ్యఅ తిథులకు హెచ్ఎం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. దాతలకు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, ప్రసాద్, చిన్నపరెడ్డి, కిరణ్, నాగరాజు, ఉపాధ్యాయినిలు ప్రసన్న, సుజాత, అపర్ణ, అంజమ్మ, అరుణ , దాతలు , విద్యార్థులు పాల్గొన్నారు.

## రీసర్వేలో వైకాపా నాయకుడు అక్రమాలపై నిరసన, ధర్నా



**మనుబోలు, జులై 29 ప్రభాతవార్త :** మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో రీసర్వేలో వైకాపా ప్రభుత్వం అక్రమాలు, అన్యాయాలకు పాల్పడిందని ఆ గ్రామ రైతులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన, ధర్నా చేశారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది రైతులు తహశీల్దార్ కార్యాలయంలో అర్జీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ గ్రామ టీడీపీ నాయకుడు మన్నెమాల ఆదిపరెడ్డి మాట్లాడుతూ కొమ్మలపూడి గ్రామంలో వైకాపా నాయకులు శ్రీనివాసులు, ప్రభాకర్, ప్రసాద్ అనే వాళ్ళు రీసర్వేలో భూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చి వెబ్‌ల్యాండ్, అడంగళ్లు మార్చేసి దొంగ పాస్ పుస్తకాలు సృష్టించారని తెలిపారు. నిజమైన హక్కు కలిగిన రైతులను మోసం చేసి నకిలీ పాస్ పుస్తకాలతో బ్యాంకులను కొల్లకొట్టారని ఆరోపించారు. 22/2ఏ సర్వే నెంబరులో 11ఎకరాల విస్తీర్ణ భూమి ఉంటే ఆరు ఎకరాలు జగనన్న కాలనీ నిర్మించారని ఆ గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు శ్రీనివాసులు మిగతా భూమిని భార్య భారతి, కొడుకు నితీష్ పేరుతో పట్టాలు తెచ్చుకుని అనుభవిస్తున్నాడని ఆదిపరెడ్డి ఆరోపించారు. రెవెన్యూ రికార్డులు మార్చి బడుగు, బలహీన వర్గాల రైతుల ఆస్తులు కొల్లగొట్టాడని వివరించారు. 25 ఎకరాలు వైసీపీ ప్రభుత్వంలో గోవర్ధన్‌రెడ్డిని అడ్డుపెట్టుకుని శ్రీనివాసులు భూకబ్జా చేసి గ్రామంలో పేదలను భయభ్రాంతులకు గురి చేశాడని విమర్శించాడు. కొమ్మలపూడిలో రీ సర్వేలో జరిగిన అక్రమాలను భూకబ్జాలను విచారించాలని ఆయన డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో ఉండాల్సిన రికార్డులు శ్రీనివాసులు దగ్గర ఉందని మండిపడ్డారు. అనంతరం ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ కందల పెంచలయ్య మాట్లాడుతూ చెరుకుమూడి నుండి కొమ్మలపూడి వరకు వైకాపా నాయకుడు 48 ఎకరాలు ఆక్రమించుకుని దొంగ రికార్డులు సృష్టించాడని ఆరోపించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో శ్రీనివాసులు భూ కబ్జా దాహం ఒక పెద్ద కుంభకోణమని అభివర్ణించారు. 1989 సంవత్సరంలో బీసీలకు ఇచ్చిన పొలాన్ని శ్రీనివాసులు కొడుకు పేరుతో ఎక్కించున్నాడని తెలిపారు. 23/2 లో 12 ఎకరాల పొలం పీఓబీలో పెట్టిఉంటే 1బి, అడంగళ్ళు శ్రీనివాసులు పేరుతో ఎలా వచ్చిందని, ఇందుకు రెవెన్యూ అధికారుల అక్రమాలు, భారీ ఎత్తున ముడుపులు తీసుకుని అవినీతికి పాల్పడ్డారని పెంచలయ్య ఆరోపించారు. తాను వైకాపా నుండి తెలుగుదేశం పార్టీలో మార్చిలో చేరానని, దీనిని జీర్ణించుకోలేక కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైకాపా నేత శ్రీనివాసులు తనపై తప్పుడు కేసులు బనాయించారని, 56 రోజులు ఊళ్లోకి రాకుండా, ఇంటికి రాకుండా తనను నానా ఇబ్బందులు పెట్టారని పెంచలయ్య తెలిపారు. వీఆర్వో వాసుదేవరెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించినప్పుడు అతని దగ్గర ఉన్న రికార్డును శ్రీనివాసులు నొక్కేసి గ్రామంలో రెవెన్యూ రికార్డులంతా తన పేరుతో మార్చుకున్నాడని పెంచలయ్య వివరించాడు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకుడు కొండ్రెడ్డి ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 24 సంవత్సరాలు క్రితం తాను కొన్న భూమిని ప్రభాకర్ అనే వ్యక్తి దౌర్జన్యంగా దున్నేసి తననే బెదిరిస్తున్నాడని తెలిపాడు. ఉన్నతాధికారులు విచారణ జరిపి గ్రామంలో జరుగుతున్న భూ అక్రమాలపైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ఆందోళనలో పెనమల్లి రవీంద్రరెడ్డి, గుండాల రమేష్, గుమ్మా శ్రీనివాసులు, కుదురు రఘురామయ్య, దార్ల నాగేంద్ర, కుదురు తిరుపతి తదితరులు పాల్గొన్నారు. రైతుల ఆరోపణలకు ఖండన: తమపై కొమ్మలపూడి రైతులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద చేసిన ఆరోపణలు అవాస్తవమని వైకాపా నాయకులు శ్రీనివాసులు, ప్రభాకర్, ప్రసాద్ ఖండించారు. గ్రామంలో రీసర్వేలో ఎక్కడా అవకతవకలు జరగలేదని, తాము ఎక్కడా భూ కబ్జాకు పాల్పడలేదని, నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించుకోలేదని వివరణ ఇచ్చారు. అదే సమయంలో రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ రైతుల ఆరోపణలపై విచారణ చేస్తామని హామీ ఇచ్చారు.

## పంచాయతి స్థలంలో ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతించండి



**జలదంకి, జులై29, ప్రభాతవార్త:** జలదంకి ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో వున్న పంచాయతీ స్థలాన్ని ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు కేటాయించాలని తెలుగు దేశంపార్టీ విజ్ఞప్తిచేసింది. ఈమేరకు మండల పార్టీ అధ్యక్షుడు పులిగుంట మధుమోహన్‌రెడ్డి, గ్రామకమిటి అధ్యక్షుడు వింతా సుబ్బారెడ్డి తదితర పార్టీ శ్రేణులు సోమవారం స్పందన కార్యక్రమంలో తహసిల్‌దార్ కార్యాలయంలో డిప్యూటి తహసిల్‌దరార్ భరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటు ఆవస్యకతను గూర్చి వివరించారు. పంచాయతి స్థలం అనువుగ వుంటుందని కావున తగు చర్యలు తీసుకోవాలని డిటికి విజ్ఞప్తిచేశారు. అలాగే కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఎంపిడిఓకె రామచంద్రలకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగ మధుమోహన్‌రెడ్డి మాట్లాడుతు ఎన్నోఏళ్ళ కార్యకర్తల కల ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటని పార్టీ మనోభావాల కనుగుణంగ ముందడుగు పడుతుంది కావున అధికారులు సహకరించాలని విజ్ఞప్తిచేశాడు. ఈకార్యక్రమంలో నేతలు మాదిరెడ్డి సుబ్బారెడ్డి, వింత సుబ్బారెడ్డి, ఏగూరి రఘు, మారుబోయిన నారాయణ, కుంకు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరం యుపి పాఠశాలలో తిథి భోజనాలు



**జలదంకి, జులై29, ప్రభాతవార్త:** జలదంకి మండలం అన్నవరం ప్రాథమికోన్నతపాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ తిథి భోజనాలు ఏర్పాటు చేశారు. దాత స్థానిక టిడిపి నేత పూనూరు రామకృష్ణారెడ్డి, ముఖ్యఅతిది ఎంపిటిసి సభ్యుడు కోర్సిపాటి మహదేవరెడ్డిలు రుచికరమైన భోజనాన్ని పిల్లలకు వడ్డించి తమ పెద్ద మనసును చాటుకున్నారు. ఈసందర్భంగ వారు మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలల్లో తిథి భోజనాలు ఏర్పాటు చేయా లన్న ప్రభుత్వ ఆదేశాల కనుగుణంగ తాము కార్యక్రమం చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం నాలుగేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భాన దీనిని రూపొందించారన్నారు. స్తానిక వనరులతో భోదనా సామగ్రి తయారు, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యపెంపు, పర్యావరణ సంరక్షణపై అవగాహన, సాంస్కృతిక అంశాలవైపు ఆకర్షించేలా కార్యక్రమాలు వారం రోజులపాటు నిర్వహించిన నేటితో ముగుస్తుందన్నారు. అయితే తిథి భోజనాల్లో విదిగ చికెన్ కర్రీ, బిరియాని, పులిహోరా, పలురకాల స్వీట్లు, పండ్లు వంటి వి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు, గ్రామ పెద్దలకు ఉపాధ్యాయులకు వడ్డించిన రామకృష్ణారెడ్డి సహకారాన్ని అందరు కొనియాడారు. ఈకార్యక్రమంలో పంచాయతి 9వవార్డుసభ్యులు సవలం శ్రీహరి, కాటంరెడ్డి మాల్యాద్రి, ముస్లిం పెద్దలు షేక్ రసూల్, ప్రధానోపాద్యాయురాలు మాధవి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శుభదిన్ భోజన్



**కోవూరు జులై 29 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సప్తాహ్ ముగింపు కార్యక్రమం సందర్భంగా సోమవారం శుభదిన్ భోజన్ తిథి భోజనం కార్యక్రమాన్ని పాఠశాలలో దాతల సహకారంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఈ పాఠశాల అభివృద్ధికి ఇనమడుగు గ్రామానికి సంబంధించిన దాతలు ఎంతోమంది తమవంతుగా సహకారం అందించారన్నారు. ఇదే స్ఫూర్తితో సోమవారం ఈ గ్రామానికి చెందిన ఆత్మ మాజీ చైర్మన్ కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి , యర్రటపల్లి సురేష్‌కు మార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొల్లారెడ్డి సునీల్‌రెడ్డిలు కోవూరుఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సూచనలతో ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఈ పాఠశాల విద్యార్థులందరికీ మంచి రుచికరమైన భోజనాన్ని , స్వీటు, వడ, అరటిపండు అందించారని, ఇందుకు వారికి ప్రత్యేక ధన్యవా దాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ, మాజీ ఎంపీపీ జి ఉమా, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులు, నేతలు పెంచలయ్య, విజయ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థులు ఉన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుదాం



**వరికుంటపాడు, జులై29, ప్రభాతవార్త:** గ్రామంలో ప్రతి ఒక్కరు మొక్కలునాటి పర్యావరణాన్ని కాపాడుదామని తెలుగుదేశంపార్టీ యువనాయకులుపేరం సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గణేశ్వరాపురం పంచాయతి పరిధిలోని రామదేవులపాడు ప్రాథమిక పాఠశాలలోయువనాయకులు పేరం సుధాకర్‌రెడ్డి , ఉపాద్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతు విద్యార్థి దశనుంచేపిల్లలకు పర్యావరణంపై అవగాహన కల్పించాలని దానిద్వార రాబోవు తరానికి కూడ మంచి వాతావరణాన్ని మనమందించ వచ్చని అన్నారుప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతోపాటు వాటిని భాద్యతాయుతంగ పరిరక్షించుకోవాలని సూసించారు. ఈకార్యక్రమంలో ఉపాద్యాయులు లక్ష్మీదేవి, వెంకయ్య, విద్యార్థినీ విద్యార్ధులు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ లక్ష్యం



**వరికుంటపాడు, జులై 29, ప్రభాతవార్త:** పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి పౌష్టికాహారాన్ని అందిం చడమే ప్రభుత్వ లక్ష్యమని తూర్పుబో యమ దుగుల గ్రామ టిడిపి సీనియర్ నాయకులు నాదేండ్ల నారయ్య అన్నారు. సోమవారం గ్రామ ప్రాదమికోన్నత పాఠశాలలో శిక్షాసప్త సుబదిన్ భోజన కార్య క్రమంలో భాగంగ అలివే లుమంగాపురం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త మేడసాని చైతన్యకుమార్, నవీన దంపతుల కుమార్తె చతుర్వి సాయితన్వి పుట్టినరోజు సందర్భంగ పాఠశాలలోని 120మంది విద్యార్దులకు వివిద రాకాల వంటకాలతో ఆహారాన్ని అందజేశారు. ఈసందర్భంగ ఆయనమాట్లాడుతు ప్రతి విద్యార్ధి ఉన్నత లక్ష్యాలతో ముందుకువెళ్ళి పాఠశాలకు తల్లి, దండ్రులకు మంచిపేరు తేవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణు, షేక్ కరిముల్లా విద్యార్థినీ విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**వరికుంటపాడు, జులై29, ప్రభాతవార్త:** వరికుంటపాడు మండల పరిషత్ సర్వసభ్యసమావేశం మంగళవారం ఎంపిపి గవదకట్ల వెంకటలక్ష్మమ్మఅధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ తోట వెంకటకృష్ణకుమారి తెలిపారు. ఈసమావేశంలో అన్ని శాఖలకు సంబందించి జరుగుతున్నఅభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడం జరుగుతుందని కాబట్టి అధికారులు తప్పని సరిగ హాజరు కావాలన్నారు. అలాగే జట్‌పిటిసి సభ్యులు ఎంపిటిసి సభ్యులు సర్పంచ్‌లు హాజరై మండల అభివృద్ధికి మార్గ నిర్దేశం చేయాలని ఆమె కోరారు.

## పెనుబల్లి సర్పంచ్ నేతృత్వంలో శుభతిథి బోజనం



**బుచ్చి జులై 29 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గ్రామంలో శిక్షా సప్తాహాల్లో భాగంగా చివరిరోజు సంహపంక్తి బోజనాలు పాఠశాలల్లో నిర్వహించారు. ఈకార్యక్రమానికి దాతలుగా గ్రామ సర్పంచ్ ఓడా పెంచలయ్య వ్యవహారించారు. పిల్లలకు ప్రత్యేక వంటకాలు, స్వీట్లు, పండ్లు, పంచిపెట్టారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతు పండుగ వాతావరణంలో సహపంక్తి బోజనం నిర్వహించడం సంతోషం కలిగించే విషయం అన్నారు. ఈకార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సర్పంచ్ పెంచలయ్యకి ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఓడా పెంచలయ్య మాట్లాడుతు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. విద్యార్ధులకు విందు బోజనం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గోన్నారు.

## చుంచులూరు ఉన్నతపాఠశాలలో శుభదిన్ కార్యక్రమం



మర్రిపాడు, జులై29, ప్రభాతవార్త : శుభదిన్ భోజన కార్యక్రమంలో భాగంగా చుంచులూరు ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు విశ్రాంత మండల విద్యాశాఖాధికారి జొన్నా సత్యనారాయణ, వారి సతీ మణి విశ్రాంత ఉపాధ్యాయురాలు కంచి అరుణ బిర్యానీ , చికెన్ కర్రీ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు అందించే మధ్యాహ్న భోజనంతోపాటుదాతల సహకారంతో ప్రత్యేకమైన వంటకాన్ని ఏర్పాటు చేయడం చాలా మంచి కార్యక్రమమన్నారు. సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పడచల నాగేశ్వరారావ్, కలిశెట్టి రాజేంద్రకుమార్, చుంచులూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, పాఠశాల ఉపాధ్యాయులు రమణయ్య, అశోక్, శివశంకరయ్య, పెంచలరావ్, మల్లిఖార్జున స్వామి, మురళీకృష్ణ, నయీం, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ మృతి



మనుబోలు, జులై 29, ప్రభాతవార్త చెన్నై- కలకత్తా 16వనెంబరు జాతీయ రహదారిపై గురివిందపూడి రోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేసూరు మహేష్ అనే వర్క్ ఇన్‌స్పెక్టర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మోటారు సైకిల్‌పై జట్లకొండూరులో కాపురం ఉంటున్న వేసూరు మహేష్ డివైడర్‌ను మోటారు సైకిల్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహేష్‌ను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు పంచాయతీ రాజ్ డిపార్టుమెంట్‌లో వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడని, మృతుడుకు భార్య ఉమామహేశ్వరి, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మనుబోలు ఎస్సై అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఫ్లైఓవర్ బ్రిడ్జికి మరమ్మతులు వెంటనే చేయాలి

### - సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ , రాస్తారోకో




కోవూరు జూలై 29 ప్రభాతవార్త : వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి మరమ్మతులకు గురై 20 రోజులు కావస్తున్నా పనులు చేపట్టకుండా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని, వెంటనే మరమ్మతులు చేసి వాహన రాకపోకలు పునరుద్ధరించాలని సీపీఎం నెల్లూరు, కోవూరు నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సాలుచింతల సెంటర్‌లో నిరన ర్యాలీ రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గుంతలమయంగా తయారైందని, గత 20 రోజుల క్రితం గుంటలు మరీ దెబ్బతినడంతో బుచ్చి వైపు వెళ్లే వాహన రాకపోకలు నిలిపివేశారన్నారు. ఈ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారన్నారు. రూటు మళ్లించారనే సాకుతో ఆర్టీసీ బస్సుల్లో 20 రూపాయలు అదనపు ఛార్జీలు వసూలు చేయడం తక్షణమే ఆపాలన్నారు. వారం రోజుల్లోగా ఈ బ్రిడ్జి మరమ్మతు పనులు చేయని పక్షంలో నిరవదిక ఆందోళన చేపడతామని ఈ సందర్భంగా నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కె. శ్రీనివాసులు, కోవూరు నేతలు షేక్ ఛాన్ బాషా, బుజ్జయ్య, వెంకటసుబ్బయ్య, మోహన్, కాలేషా, నజీర్‌తో పాటు నగర కమిటీ సభ్యులు ఎం. ప్రసాద్, జాఫర్, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

## దుప్పిని చంపిన వ్యక్తి అరెస్ట్



ఉదయగిరి, జులై 29, ప్రభాతవార్త: దుత్తలూరు మండలం భైరవరంలో దుత్తలూరు ఫారెస్ట్ అధికారులు , ఆత్మకూరు ఫరెస్ట్ అధికారుల జా యింట్ ఆపరేషన్లో దుప్పిని చంపి మాంసం విక్రయిస్తున్న బొమ్మల వెంగయ్య అనే వ్యక్తిని పట్టుకున్న అధికారులు. భైరవరంలో జరుగు తున్న అటవీ జంతువుల వేటగాళ్ల ను కొన్ని నెలలుగా నిఘా వేసి జాయిం ట్ ఆపరేషన్ నిర్వహించి పకడ్బం దీగా పక్క ప్లాన్‌తో వేట గాలను పట్టుకున్నట్లు ఉదయగిరి రేంజ్ ఆఫీసర్ ఉమామహేశ్వర్ రెడ్డి విలేకరుల సమావేశంలో తెలి పారు. అతని మీద చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేసి సోమవారం నాడు కోర్టులో హాజరు వరుస్తామని తెలిపారు. అతని నుండి జంతువులను వేటాడానికి ఉపయోగించే పలలు తాళ్ల కత్తులు జంతువుల మాంసం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

## మధ్యాహ్నం భోజనం పథకానికి సీతమ్మ పేరు పెట్టడం హర్షణీయం

## సీతమ్మ సేవలు చిరస్మరణీయం



నెల్లూరు, జులై 29, ప్రభాతవార్త - వైద్యం : తెలుగునాట అడిగిన వారికి అడగని వారికి నిత్యనదానం చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన ఆంధ్రుల అన్నపూర్ణ రత్న సీతమ్మ పేరును మధ్యాహ్నం భోజన పథకానికి పెట్టడం చిరస్మరణీయమని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ తడకపల్లి సుధా రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న సుధారవీంద్ర నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెడుతున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు ప్రకటించారన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో పుట్టిన డొక్క సీతమ్మ బ్రాహ్మణ స్త్రీ అయినప్పటికీ కులమతాలకి అతీతంగా ఆకలిగున్నవారికి కడుపునిండా అన్నం పెట్టడమే ధ్యేయంగా కృషి చేసిందని తడకపల్లి అన్నారు. మానవ సేవయే మాధవ సేవగా జీవించిన ఆమె చేసిన నిత్య అన్నదానం వల్ల ఆస్తులు కరిగిపోయి శివరాత్రికి కడు పేదరాలైపోయిందన్నారు. భర్త ఇచ్చిన సహకారంతో తన జీవితమంతా పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా జీవించిందన్నారు. ఒక లక్ష సందర్భంలో ఆమె పల్లకిలో దైవ దర్శనానికి వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రయాణిస్తున్న పాఠశాలలో ఒక బిడ్డ ఆకలని ఏడవసాగిందన్నారు. ఆ సందర్భంలో ఆ బిడ్డ తండ్రి నాన్న ఎడవకు మనం దగ్గర్లోనే డొక్కా సీతమ్మ ఊరికి వెళ్తున్నాం ఆ తల్లి మనకు అన్నం పెడుతుంది అని ఆకలి తీరుతుందని అన్న తండ్రి మాటలు విన్న సీతమ్మ వెంటనే కూడా పోకుండా తిరిగి ఇంటికి కడుపు నింపిందన్నారు. అందుకని తెలుగు జాతి ఉన్నంత వరకు ఆమె పేరు చిరస్థాయిగా ఉంటుందని అలాంటి మాతృమూర్తి పేరును మధ్యాహ్నం భోజన పథకానికి పెట్టడం సంతోషకరమని తడకపల్లి సుధా రవింద్ర ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# హిట్లర్ పాలనను అమలు చేసిన జగన్



నెల్లూరు, జులై 29, ప్రభాతవార్త - వైద్యం ప్రపంచంలోనే ఏ దేశంలో కూడా ఏ రాష్ట్రంలో లేని విధంగా జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినట్టుంది. హిట్లర్ పాలనను తూచా తప్పకుండా ఈ రాష్ట్రంలో అమలు చేశాడని ఇందులో ఎంత మాత్రం అతిశయోక్తి లేదని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర విమర్శించారు. సోమవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో రవిచంద్ర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ చేసిన పనులతో రాష్ట్ర ఆర్ధిక స్థితిగతులు మారిపోయాయి అన్నారు. దేవుడు రాసిన స్క్రిప్టులు చదువుతున్న చంద్రబాబు నాయుడుని ఎద్దేవా చేసిన జగన్ ఆదేవుడే ఆయనకి 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా లేకుండా చేశాడన్నారు. దిక్కుమాలిన అబద్దాలతో, ధర్నాలతో ప్రజలను మభ్య పెట్టాలని జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారు. గత ఐదు సంవత్సరాలలో దేశంలో మన రాష్ట్రంలో జరిగిన దమనకాండ మరెక్కడా జరగలేదని ఇసుక క్వాడ్జ్ సిలికా మైనింగ్ తెల్లరాయి లాంటి ప్రకృతి వనరులను దోచేసారన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, ప్రజల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, రాజ్యాంగ వ్యవస్థను కోల్పోయామని, పోలీసులు సహా యంత్రాంగాలన్నిటిని నిర్వీర్యం చేశారంటూ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతుంటే వినడానికే కొత్తగా ఉంది. విధ్వంసం, అరాచకం, అన్యాయం, అక్రమం, అవినీతి గురించి జగన్ మాట్లాడుతుంటే వినడానికే విడ్డూరంగా ఉందని రవిచంద్ర అన్నారు. ఏ రాచరికంలోనూ, నియంత పాలనలోనూ కనిపించని దౌర్జన్య కాండ జగన్ ఏలుబడిలోనే సాగింది. ఐదేళ్ల జగన్ రాజ్యంలో అత్యంత పాశవికంగా జరిపిన దాడులు ఉదంతాలు రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరచిపోరు. రాష్ట్రంలో ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగింది. అక్షరాల మారణ హోమం, ప్రజాస్వామ్య విలువలకు పాత్ర వేసి నిర్దాక్షిణ్యంగా మారణకొండ జరిపిన నియంతృత్వ నేత జగన్ అని రవిచంద్ర ధ్వజమెత్తారు. ప్రపంచంలోనే ఏదేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉంటూ గంజాయి డ్రగ్స్ అమ్మిన కుటుంబం ఏదైనా ఉందంటే అది ఒక్క జగన్మోహన్ రెడ్డి కుటుంబమేనని అందులో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి నేటికీ 60 రోజులు పూర్తి కాలేదన్నారు. అప్పుడే జగన్మోహన్ రెడ్డి ఢిల్లీకి పోయి కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రలో రద్దు చేయాలని అనడం హాస్యాస్పదంగా ఉందని బీద అన్నారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని రావణకాష్టం చేసి, గతాన్ని మరిచి గగ్గోలు పెట్టడం సిగ్గుమాలిన తనమే, చేయాల్సి న అరాచకం, ఆకృత్యాలు, దాడులు, వేధింపులు అన్ని చేసి, అక్రమ కేసులతో ప్రతిపక్షాన్ని పీడించిన జగన్మోహన్ రెడ్డి, నేడు ధర్మధర్మాల గురించి, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. వైసిపి పాలనలో దాదాపు 100 మందికి పైగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను దారుణంగా హత్య చేశారు. వేలాది మంది కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి జైల్లోకి పంపారు. ఇల్లు ధ్వంసం చేశారు. తోటలు తగలబెట్టారు. ఉద్యాన పంటలు నరికేసి పొలాలు లాక్కున్నారని తెలిపారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల ఆర్థిక మూలాలను నాశనం చేయడమే లక్ష్యంగా పనిచేసిన ఘనత జగన్‌దేనన్నారు. దాదాపు 57 శాతం ఓట్లు, 93 శాతం సీట్లు వచ్చిన ప్రభుత్వాన్ని నెలరోజులకే రద్దు చేయాలని కోరడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం కావొచ్చు. భారతదేశ చరిత్రలో దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలలో ఆ రాష్ట్రాలను పరిపాలించిన ముఖ్యమంత్రులు అందరూ ఆయా రాష్ట్రాలకు ఎంతో కొంత మేలు చేశారు. ఒక్క జగన్మోహన్ రెడ్డి తప్ప. రేషన్ బియ్యం నుండి తెల్లరాయి వరకు వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఒక్క దానిలోను భారీ అవినీతికి పాల్పడ్డారు. పెద్ద ఎత్తున భూ దోపిడికి పాల్పడ్డారు. ఖనిజ సంపద, అడవులను ఇష్టానుసారం ధ్వంసం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు సాగునీరు, త్రాగునీరు, విద్యుత్ వంటి బహుళ ప్రయోజనాలు చేకూర్చే ప్రాజెక్టు పోలవరాన్ని బలిపీఠం పైకి నెట్టి ఐదు కోట్ల ఆంధ్రుల ఉసురు పోసుకున్నారన్నారు. అమరావతి రాష్ట్ర ఆర్ధిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, విమర్శించారు. సహజ వనరులను దోచుకొని ఖజానాను ఖాళీ చేశారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో అవినీతి వవిచ్చలవిడిగా జరిగింది. వైసిపి ఐదేళ్ల అడ్డగోలు పాలనలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, వైసిపి నేతలు ఎన్ని వేల కోట్లు కొల్లగొట్టారో ఏ ఆర్థిక నిపుణుడు నిగ్గు తేల్చలేని పరిస్థితి. గత ఐదు సంవత్సరాలలో వైసిపి నాయకులు అడ్డంగా దోచుకున్న అక్రమార్జన మొత్తాన్ని కక్కించి ఖజానాకు చేర్చితే, రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు అప్పులు చేయవల్సి న అవసరం ఉండదన్నారు. వారి అవినీతి బయటపడుతుందన్న ఉద్దేశంతో ఆర్డీవో కార్యాలయాన్ని తగలబెట్టిన ఘనులని బీద ఆరోపించాడు. చంద్రబాబు నాయుడు కమ్మ వాళ్లకే అన్ని దోచిపెడుతున్నాడని జగన్మోహన్ రెడ్డి వైసిపి నేత ఆరోపిస్తున్నారని అందులో నిజం లేదని అందుకు నిదర్శనం ఎంతో మంది పారిశ్రామికవేత్తలు రెడ్డి కులస్తులేని ఇది జగన్ జగమెరిగిన సత్యమన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లరెడ్డి డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాతంగి కృష్ణ, శ్రీకుర్తి రవీంద్రబాబు కాకి ప్రసాదరావు, జిల్లా అధికార ప్రతినిధి సాబీర్ ఖాన్, పనబాక భూ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధుల పట్ల అవగాహనా కార్యక్రమం



ఉదయగిరి, జులై 29, ప్రభాతవార్త: ఉదయగిరి పూసల కాలనీ నందు ప్రజలకు టైఫాయిడ్, కామె ర్లు, డయేరియా, మలేరియా , డెంగ్యూ వ్యాధుల గురించి గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విద్యాధికారి కలసపాటి. వెంకటసుబ్బయ్య ఆగాను కల్పించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధులకు కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమల భారి నుండి రక్షించుటకు దోమతెరలు వాడాలని తెలియజేశారు. ముఖ్యంగా టైఫాయిడ్ కామెర్లు వైరల్ ఫీవర్స్ నీరు కలషితం వల్ల వ్యాపిస్తాయని అందువలన ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని సూచించారు దోమ కాటు ద్వారా మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా వ్యాధులు వ్యాపిస్తాయని తెలియజేశారు జ్వరం వచ్చిన వారు వెంటనే ఆశా కార్యకర్త ద్వారా విలేజ్ హెల్త్ క్లినిక్ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు ఇక్కడ వైద్యశిబిరం నిర్వహించి ఏఎన్ఎం ఎంఎల్ హెచ్‌పిల ద్వారా చిరు వ్యాధులకు చికిత్స నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది ఉదయగిరి సబ్ యూనిట్ అధికారి దోమల నివారణ చర్యలు భాగంగా ప్రతి ఇంటికి ఇండోర్ స్పేస్‌లో స్ప్రేయింగ్ చేయించడం జరిగింది నేటినుంచి సచివాలయ సిబ్బంది మరియు వైద్య సిబ్బంది పరీక్షంచడం జరిగింది. శానిటేషన్ కార్యక్రమాన్ని స్థానిక పంచాయతీ కార్యదర్శి కరీముల్లా పర్యవేక్షించారు ఈ కార్యక్రమంలో టీవీ సూపర్వైజర్ బి.వెంకటేశ్వర్లు, ఎంఎల్ హెచ్ పి రామారావు ఏఎన్ఎం నూర్జహాన్ ఆరోగ్య సహాయకులు రబ్బానీ భాష పంచాయతీ సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్ గారు తెల్కమిట్ట గిరిజనుల సమస్యల పరిష్కరించండి



నెల్లూరు, జులై29ప్రభాతవార్త కొడవలూరు మండలం, యల్లాయపాళెం పంచాయితీలోని తెల్కమిట్ట గిరిజన కాలనీలో గిరిజనుల సమస్యలుపరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోట్లూరి శ్రీనివాసులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ గిరిజన కాలనీలో 70 కుటుంబాల చల్లా యానాదులు నివసిస్తూన్నారని వారిలో 36 కుటుంబాలకుచెందిన చల్లా యానాదులు ప్రభుత్వ స్థలములో పూరిగుడిసెలు వేసుకొని జివిస్తున్నారన్నారు. వారికి నివేశన స్థలాలుమంజూరుచేసి పక్కా గృహాలు ఏర్పాటు చేయాలని కోరా రు. గిరిజనులు తాగునీరు కోరకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌పగిలిపోయినందున త్రాగునీరు నిలువ చేసుకునే అవకాశం లేక కరెంట్ వున్నప్పుడు మాత్రమే త్రాగునీరు అందుతుందన్నారు. దీంతో రెక్కాడితే కాని డొక్కాడని గిరిజనులు పనులు మానుకొని తాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. బడికి పోవాల్సి న గిరిజన బాల, బాలికలు యల్లాయపాళెం వెల్లి చదువుకోవాల్సి వున్నందున ఈ ప్రాంతంలో అంగన్ వాడీ, పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి కోరకు సిన్టెక్స్ వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయడంతోపాటు పూరిగుడిసెలలో నివసిస్తున్న గిరిజనులుకు పక్కా గృహాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోనెల్లూరు జిల్లా కిషాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మాల్యాద్రీ, గిరజన మోర్చా రాష్ట ఉపాధ్యాక్షుడు పోట్లూరి శ్రీనివాసులు తదితరులున్నారు.

## మెప్మా పీడీ, డీఈఓలను అభినందించిన జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్






నెల్లూరు అర్బన్, జులై 29, ప్రభాతవార్త ఫ్లాగ్ దేను పురస్కరించుకుని జిల్లా నుండి ఎక్కువ మొత్తంలో నిధి సేకరించి సైనిక సంక్షేమ నిధికి అందజేసిన మెప్మా పిడి రవీంద్ర, డిఈఓ రామారావులను జిల్లా కలెక్టర్, జిల్లా సైనిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ ఓ ఆనంద్ అభినందించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మెప్మా పిడి రవీంద్ర, డిఈఓ రామరావులను కలెక్టర్ శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. మెప్మా పీడీ 6.57 లక్షలు, డిఇఓ 3.3 లక్షలు సేకరించి సైనిక సంక్షేమ నిధికి అందజేశారని జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.ఎస్ రమేష్ తెలిపారు. అలాగే జిల్లాలో సైనిక సంక్షేమ నిధి కోసం 18 లక్షలు సేకరించి మూడవ స్థానం సాధించినందుకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నామని రమేష్ తెలిపారు.

## కోవూరు సబ్ డివిజన్‌కు 100 మినీ గోకులాలు



కోవూరు జూలై 29 ప్రభాతవార్త : కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివి జన్ పరిధిలోని రెండు మండలాలకు సంబంధించి 100 మినీ గోకులాలు మంజూరయ్యాయని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ మౌర్య అన్నారు. స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కోవూరు పశు సంవర్ధకశాఖ డివిజన్ పరిధిలోని కోవూరు మండలానికి 50, విడవలూరు మండలానికి 50 మినీ గోకు లాలు ఎంపిక చేయడం జరిగిందన్నారు. పశువులు, మేకలు, కోళ్ల పెంపకం చేసే రైతులు ఇటువంటి మంచి అవకాశాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. రెండు పశువులకు సంబంధించి షెడ్డు నిర్మాణానికి 1.15 లక్షలు మంజూరు చేస్తుందని, దీనికి సంబంధించి రైతు 10 శాతం చెల్లిస్తే మిగిలిన 90 శాతం సబ్సిడీగా ప్రభుత్వం భరిస్తుందన్నారు. అదేవిధంగా 4 పశువులకు సం బంధించి 1.85 లక్షలు మంజూరు కాగా.. 10 శాతం రైతు చెల్లించాలని, అదేవిధంగా 6 పశువులకు సంబం ధించి 2.30 లక్షలు మంజూరు కాగా రైతు 10 శాతం చెల్లించాలన్నారు. అదేవిధంగా 20 మేకలకు సంబం ధించి ప్రభుత్వం 1.30 లక్షలు మంజూరు చేస్తుందని, రైతులు ఇందులో 30 శాతం చెల్లించాలన్నారు. అదేవిధంగా 50 మేకలకు 2.30 లక్షలు మంజూరు కాగా.. 30 శాతం రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా 100 కోళ్ల షెడ్డుకు 87 వేలు మంజూరు చేస్తుందని, ఇందులో 30 శాతం రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 200 కోళ్లకు 1.32 లక్షలు మంజూరు కాగా.. 30 శాతం రైతులు చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఈ మినీ గోకులాలు నిర్మించడం జరుగుతుందన్నారు.

## ముగిసిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



నెల్లూరు, జులై29 ప్రభాతవార్త-విద్య రెండు రోజులపాటూ నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్‌పోటీలు, రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపిక ప్రకియ సోమవారంతో ముగిసింది. కాగా అండర్ 11,13,15,17,19 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతుల ప్రధానోత్స వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పోటీల్లో పాల్గొని విజయం సాదించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సాధారణమని, ఓడిన వారు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రయత్నించాలన్నారు. ఈ పోటీల్లో విజయం సొంతంచేసుకున్న వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. త్వరలోనే నగరంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించేందుకు తమ సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఎల్లప్పుదు ముందువరుసలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడి ్మంటన్ అసోసియేషన్ సభ్యులు ఇమిడిశెట్టి శ్రీకాంత్, మద్దిపాటి ప్రసాదరావు, తాళ్లపాక వరప్రసాద్, జిల్లా క్రీడాదికారి ఆర్‌కే. యతిరాజ్, విజయ్‌కుమార్, కోచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉలవపాళ్ళ విహెచ్‌సిని తనిఖీ చేసిన అడిషనల్ డియంఅండ్‌హెచ్‌వో



దగదర్తి, జులై 29 ప్రభాతవార్త దగదర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఉలవపాళ్ళ విహెచ్‌సిని అడిషనల్ డియంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వల్లి సోమవారం తనిఖీ నిర్వహించారు. లెప్రసీ సర్వే, అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ పరిశీలించారు. బిసిజి వాక్సినేషన్ గురించి అందరికి అవగాహన కల్పించారు. లెప్రసీ సర్వే ఏ విధంగా చేయాలి, ఆన్‌లైన్ సర్వేపై సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దగదర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అఖిల, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌యం, ఆశా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కావలిలో ల్యాబ్లు, స్కాన్ సెంటర్లను తనిఖీ చేసిన డిప్యూటీ డియంఅండ్‌హెచ్‌వో



కావలి, జులై 29 ప్రభాతవార్త కావలి పట్టణంలో ల్యాబ్లు, స్కాన్ సెంటర్లను సోమవారం కావలి డిప్యూటీ డియంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పి.బ్రిజిత ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కావలి పట్టణ పరిధిలో వివిధ రకాల పరీక్షలకు సంబంధించిన ల్యాబ్‌లలో అధిక మొత్తంలో రోగుల వద్ద దోపిడీకి పాల్పడుతున్నారని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన డిప్యూటీ డియంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పి.బ్రిజిత కావలి క్రిస్టియన్‌పేటలోని ల్యాబ్లు, స్కాన్ సెంటర్లను తనిఖీ చేశారు. ల్యాబ్ యాజమాన్యం ఏఏ పరీక్షలకు ఎంత వసూలు చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లకు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ వుందా, లేదా పరీక్షలు డాక్టర్ సలహాలతోనే చేస్తున్నారా అనే అంశాలు పరిశీలించి తగు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్దంగా చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరికలు చేశారు. అనంతరం స్కాన్ సెంటర్లను కూడా తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని అలా చేస్తే ఆసుపత్రి రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

## శాఖాంబరీ దేవిగా శ్రీ పర్వత వర్ధినీ అమ్మవారు



రాపూరు, జులై 29 ప్రభాతవార్త మండలకేంద్రమైన రాపూరులోని శ్రీ రామనాధేశ్వర స్వామి వారి ఆల యంలోని శ్రీ పర్వతవర్ధనీ దేవికి సోమవారం శా ఖాంబరి దేవి అలంకారం నిర్వహించారు. ఆషా డమాషంలో ఆడికృతిక సందర్భంగా అమ్మవారికి ఈఅలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పలు రకాలైన కూరగాయాలతో ప్రత్యే కంగా ఆలంకారంనిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకోని శాఖాంబరి దేవిగా వున్న పర్వతవర్ధనీ దేవిని, శ్రీ రామలింగేశ్వర స్వా మిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఆలయ ప్రధానార్చకులు